క్లుప్తంగా

లే-అవుట్లలో నుడా అధికారి పరిశీలన

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సమీపంలో ఉన్న లే-అవుట్లను నుడా అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి ఖాదర్‌బాషా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని సర్వే నంబర్లలో ఏర్పాటు చేసిన లే-అవుట్ల వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నుడా వీసీ ఆదేశాల మేరకు పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లుగా తెలుస్తోంది.

దొరువు ఆక్రమణకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురంలో దొరువు ఆక్రమణను గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. దొరువు సమీపాన ఉన్న ఓ వ్యక్తి కంచెను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడంతో గ్రామస్తులు వెళ్లి పనులు జరగకుండా ఆపేశారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

మెనూ ప్రకారమే భోజనం అందించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసన్న

విడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.ప్రసన్న తెలిపారు. స్థానిక బీసీ హాస్టల్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం టిఫిన్, పాలు, చిక్కీలు, స్నాక్స్ అందిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నూరుశాతం అమలయ్యేలా భోజనం అందించాలని ఇన్‌చార్జి వార్డెన్ సురేష్‌కు సూచించారు. విద్యార్థులందరికీ బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని తెలియజేశారు. విద్యార్థుల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలు పెంచాలి

- డీఈఓ రామారావు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలను పెంచాలని డీఈఓ పీవీజే రామారావు తెలిపారు. పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఓపెన్ స్కూల్స్‌కు సంబంధించి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 – 25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ అభ్యాసకుల కోసం ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓలు, ఓపెన్ స్కూల్ సమన్వయకర్తలు, ఎంఈఓలు, జిల్లా కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో ఒకేచోట వైద్యపరీక్షలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో రోగులకు అవసరమైన రక్త, ఇతర వైద్యపరీక్షలు ఒకేచోట అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో రక్తపరీక్షలు, యూరిన్, స్కానింగ్ ఇలా పరీక్షలు పాత ఆస్పత్రిలో కొన్ని, కొత్త భవనంలో కొన్ని ఉండేవి. ఈ నేపథ్యంలో మైక్రోబయాలజీ, పెథాలజీ, బయోకెమిస్ట్రీ పరీక్షలను కేంద్రీయ పరీక్ష కేంద్రం (సెంట్రల్ ల్యాబ్) భవనానికి మార్చారు. శుక్రవారం నాటికి ఇవన్నీ ఒకేచోటుకు చేరుకున్నాయి. మూడంతస్తుల నూతన భవనంలో ప్రస్తుతం సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు అందుతున్నాయి. బ్లడ్‌బ్యాంక్‌ను మార్చాల్సి ఉంది. ఇదిలా ఉండగా రోగులకు సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

అడిషనల్ డీఎంహెచ్ఓ తనిఖీలు

నెల్లూరు(అర్బన్): మాదక ద్రవ్యాల అలవాటును మాన్పించేందుకు కృషి చేస్తున్న స్థానిక పొదలకూరు రోడ్డులోని నవజీవన్ అనే స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు తీసుకుంటూ ఆ సంస్థలో నమోదైన వారి వివరాలను ఆరాతీశారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాన్నారు. ఇలాంటి వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రూరల్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ డీఎస్పీగా ఘట్టమనేని శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక మూలాపేటలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు 1991 బ్యాచ్ ఎస్సై. గతంలో కృష్ణపట్నం పోర్టు సీఐగా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. తిరుపతి పీటీసీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు రూరల్ డీఎస్పీగా నియమితులయ్యారు.

గాడితప్పిన శాంతిభద్రతలు

- బుచ్చిలో మహిళపై లైంగికదాడి కేసును నీరుగార్చిన వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు కూడా పూర్తి కాక ముందే అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు మరువక ముందే తాజాగా నగర పంచాయతీ పరిధిలో ఓ మహిళపై కల్యాణ్ అనే యువకుడు మద్యం మత్తులో గత శనివారం విచక్షణారహితంగా కొట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అదేరోజు పోలీసుస్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. రెండు రోజుల తర్వాత మంగళవారం తూతూమంత్రంగా కేసు నమోదు చేసి అంతటితో తమ పనైపోయిందన్నట్టుగా చేతులు దులుపుకున్నారు. నిందితుడు దర్జాగా బయట తిరుగుతుండడం చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మహిళను విచక్షణారహితంగా కొట్టి లైంగికదాడి చేసిన వ్యక్తిని కనీసం విచారణ చేయకుండా ఇలా వదిలివేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

దిశ, మహిళా సంఘాల అండతో..

చివరకు దిశ, మహిళా సంఘాలు బాధితురాలి గురించి తెలుసుకుని బుచ్చి సీఐ హైమారావు, నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో మాట్లాడి నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమె కుడిచెవి తీవ్రంగా దెబ్బతిని వినికిడి సమస్య ఏర్పడిందని తెలిపారు.

పోలీసుల తీరు ఆందోళనకరం

పట్టపగలు మహిళపై లైంగికదాడి జరిగితే పోలీసులు స్పందించిన తీరు ఆందోళనకరంగా ఉంది. మహిళ మాన ప్రాణాలకు ముప్పు ఏర్పడితే పోలీసులు స్పందించే తీరు ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల నగర పంచాయతీ పరిధిలో పలు ఇళ్లలో దొంగతనాలు, నిత్యం మైనర్లు బైక్‌లపై ఇష్టారాజ్యంగా తిరుగుతూ అలజడి సృష్టిస్తున్నా పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి పోలీసులు మధ్యవర్తులుగా అవతారమెత్తి సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని చెప్పారు. అదేలా కోవూరు నియోజకవర్గంలో మొదటిసారి మహిళా ఎమ్మెల్యేగా గెలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.. సాక్షాత్తు ఓ మహిళపై భౌతిక, లైంగికదాడి జరిగితే స్పందించకపోవడం, నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తే ప్రభుత్వం ఏవిధంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కోవూరు : వరి పంటను సాగు చేస్తున్న రైతులు తెగుళ్ల నివారణపై చర్యలు చేపట్టాలని ఆత్మ డీపీడీ శివనారాయణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ శివజ్యోతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం కోవూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పంటలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి చిరు పొట్టదశలో ఉందని, రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని తెలిపారు. ఇక్కడ ప్రధానంగా ఆకు ముడత పురుగు ఆశించి ఉందని, వీటి నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కోవూరు ఏడీఏ సుజాత, మండల ఏఓ ఇందిరా, పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న నిర్వాహకులు

ఇందుకూరుపేట : రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు ఇందుకూరుపేట ఎంకేఆర్ క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పురుషులు, మహిళల జట్లు పాల్గొంటున్నాయి. పమజుల శ్రీనివాసులు, మహాలక్ష్మి మెమోరియల్ 11వ రాష్ట్ర పోటీలను అసోషియేషన్ ప్రతినిధులతో కలసి నాయకులు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించడం ఆనందదాయకమని చెప్పారు. క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవంతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడా పోటీల నిర్వాహకుడు పమజుల రవి, నిర్వహణ కార్యదర్శి దాసరి విజయ్‌కుమార్‌ను అతిథులు అభినందించారు. తొలుత క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం అతిథులు పోటీలు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, డీఎస్‌డీఓ ఆర్కే యతిరాజు, ఒలింపిక్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం



కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పొదలకూరు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల స్థాయి నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న మంద కృష్ణమాదిగ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. ముందుగా నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని, కోర్టు తీర్పు ద్వారా నిరూపితమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వంగపాటి సుబ్రహ్మణ్యంమాదిగ, చిడదల శ్రీనివాస్‌మాదిగ, ఆలుపూరు పాపయ్యమాదిగ, గోపీమాదిగ, శివాజీమాదిగ, శివకృష్ణమాదిగ, వెంకటేశ్వర్లుమాదిగ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

ముత్తుకూరు : ఎస్సీ రిజర్వేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సాయంత్రం ముత్తుకూరులో సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. మాదిగ రిజర్వేషన్ల కోసం ఏళ్ల తరబడి పోరాటం సాగిస్తున్న మంద కృష్ణమాదిగకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్ మాదిగ, కృష్ణయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

- పద్మావతినగర్‌లో ఘటన

పొదలకూరు : పట్టణంలోని పద్మావతినగర్‌లో శుక్రవారం హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అయి పలువురి ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు వంటి పలు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఇక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం ఏర్పడి హైఓల్టేజీ సరఫరా జరిగింది. వెంటనే స్థానికులు లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను యథావిధిగా పునరుద్ధరించారు. అయితే కొద్దిరోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు స్థానికులు ఏడీఈ సురేంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన పరిశీలించి మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తానన్నారు.

వెంకటాచలం సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారావు

వెంకటాచలం : వెంకటాచలం సీఐగా సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న సుబ్బారావును వెంకటాచలం సీఐగా నియమించడంతో శుక్రవారం ఉదయం వెంకటాచలం వచ్చి బాధ్యతలు చేపట్టారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు, చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు తెలియజేశారు.

చోరీకి యత్నించి.. అడ్డంగా దొరికి..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని సాల్మన్‌పురం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో ఓ వ్యక్తి చోరీకి యత్నించి స్థానికులకు దొరికిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సాల్మన్‌పురం గ్రామానికి చెందిన గోరు కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా చూసుకున్న ఓ ఆగంతకుడు శుక్రవారం ఇంటి తాళాలను పగులగొట్టి లోపలకు చొరబడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో శబ్దాలు రావడంతో స్థానికులు గమనించి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉచితంగా ఎలుకల మందు పంపిణీ



పంట పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు : పొలాల్లో ఎలుకల నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందును పంపిణీ చేస్తోందని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి వెల్లడించారు. ముత్తుకూరు, బలిజపాళెం గ్రామాల్లో శుక్రవారం వరి పొలాలను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పంటపొలాల్లో ఎలుకల బెడద తీవ్రంగా ఉన్నట్లు రైతులు ఆందోళన వెలిబుచ్చారు. దీనికి ఏడీఏ స్పందిస్తూ ప్రభుత్వం 'బ్రోమోతయోలిన్' అనే ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తోందని చెప్పారు. దీనిని ఎలా వినియోగించాలో తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నామన్నారు. వీఏఏలు నవీన్, కరీమ్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మహాసభను జయప్రదం చేయండి



ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతున్న ఏపీటీఎఫ్ బాధ్యులు

పొదలకూరు : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌ను స్థాపించి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 10వ తేదీన నెల్లూరు టౌన్ హాలులో నిర్వహించే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర సబ్‌కమిటీ సభ్యుడు ఎస్‌కే ఎండీ రియాజ్ కోరారు. మండలంలోని మరుపూరు, తోడేరు, చాటగొట్ల, పొదలకూరు, ఇనుకుర్తి తదితర పాఠశాలలకు శుక్రవారం వెళ్లి ఉపాధ్యాయులను కలిసి జిల్లా మహాసభకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రులు, విద్యాశాఖ అధికారులు పాల్గొనే సభలో విద్యా సంబంధమైన విషయాలను చర్చిస్తామన్నారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కార్యదర్శి పిచ్చిబాబు, సుబ్బారెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ఇన్‌చార్జి వీసీ, అధ్యాపక సిబ్బంది

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో స్వాతంత్ర సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీఎస్‌యూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఎస్.విజయభాస్కర్‌రావు, అధ్యాపక సిబ్బందితో కలిసి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులకు పింగళి వెంకయ్య దేశభక్తి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆ రోజుల్లో మహాత్మా గాంధీతో పింగళి వెంకయ్యకు ఉన్న సన్నిహిత సంబంధాలతో స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఉపాధి మస్టర్లు



మర్రిపల్లిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పొదలకూరు : గ్రామాల్లో ఉపాధి హామీ మస్టర్లు పక్కాగా ఉండాలని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ అన్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మస్టర్లలో అవకతవకలు నెలకొంటే చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించాల్సిందిగా సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి కూలీలకు సంబంధించిన మెడికల్ కిట్లను మేట్లకు అందజేశారు. పనుల సందర్భంగా ఎవరైనా కూలీలు గాయపడితే ప్రాథమికంగా చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు ఉపయోగపడుతాయన్నారు. ఎంపీడీఓ వెంట టీఏ వెంకటసాయి తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై హెచ్ఎంలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు

కొడవలూరు : పాఠశాలల నిర్వాహక కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలపై మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన గండవరం హైస్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 8న అన్ని పాఠశాలల్లో నిర్వాహక కమిటీ ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఇందులో ఎంపికయ్యే ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు పాఠశాలల నిర్వహణ, యాజమాన్య బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల అభివృద్ధికి దోహదపడే ఈ కమిటీల ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుని వారి ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ఆయా పాఠశాలల హెచ్ఎంలు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



మనుబోలు : తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

పొదలకూరు : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, గర్భిణులు విధిగా తల్లిపాలు పట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఇనుకుర్తి, మర్రిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగించాల్సిందిగా సూచించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ సుకన్య, అంగన్‌వాడీ టీచర్లు మోక్షలక్ష్మి, వసుమతి, బుజ్జమ్మ, వెంకరమణమ్మ, ఆశావర్కర్ విజయమ్మ పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్టం

మనుబోలు : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని జట్లకొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీసం సంవత్సరం పాటైనా బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు వచ్చే ముర్రుపాలను తప్పకుండా తాగించాలన్నారు. అలాగే ఎల్ఎన్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రమణమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.నాగమ్మ, ఉపసర్పంచ్ ఎ.తులసీరాం, సూపర్‌వైజర్ పద్మజ, ఏఎన్ఎం రజిత, అంగన్‌వాడీలు విజయమ్మ, వెంకటసుబ్బమ్మ, రేవతి, గౌరి పాల్గొన్నారు.

ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి

కొడవలూరు : ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రామన్నపాళెంలో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు తాగించడం ద్వారా బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎస్.శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రోజా, పావని, సుజన, జానకి, ఆశా కార్యకర్త మమత పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు తొలి టీకా

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తొలి వ్యాధి నిరోధక టీకాలా ఉపకరిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురంలో గర్భిణులు, బాలింతలకు ముర్రుపాల ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు వై.సురేఖ, ఏఎన్ఎం వై.సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

ఇందుకూరుపేట : తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని నరసాపురంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ తల్లిపాలల్లో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జానకీ, పద్మావతి, నవనీతమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి



ఇందుకూరుపేట : నరసాపురంలో..



మనుబోలు : ఎల్ఎన్‌పురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



కొడవలూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నిర్మల